94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18







# రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 32, పేజీలు 4 వేల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక ఏప్రిల్ సోమవారం 30 - ఆదివారం 6 మే, 2018

పేజీలు2లో...



దుల్హన్ పథకానికి మంగళం

పేజీలు4లో...



పరిశోధనలకు పెద్దపీట : ఎస్ ఆర్ ఎం

పేజీలు4లో...



పసివారి రక్షణకు టూల్

పేజీలు4లో...



ధనిక-పేద తారతమ్యం కమ్యూనిజంతోనే అంతం

# ఇది మల్లెల వేళ....

**ఎండాకాలం అనగానే గుర్తుకొచ్చేది సువాసనలు వెదజల్లే మల్లెలు, పండ్లలోనే రారాజైన మామిడి, మండే ఎండలకు విరుగుడుగా తాటిముంజెలు లాంటివన్నీ గుర్తుకొస్తాయి. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలు జోరందుకోవడంతో సాగుభూమి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో మల్లెతోటల విస్తీర్ణం తగ్గి రేట్లు ఎండలతో పోటీపడుతున్నాయి.**



మల్లెల గుబాళింపు మాటలకు అందనిది.... వాటి పరిమళాలకు ఎంతటివారైనా మైమర్చిపోవాల్సిందే. మల్లె పేరు వింటేనే మనసు మురిసిపోతుంది. తెలుగింట చైత్ర, వైశాఖ మాసాల్లో జరిగే ప్రతీ శుభకార్యంలోనూ మల్లెల చేసే హడావుడి అంతా ఇంతాకాదు. వీళ్లువాళ్లు అనే తేడాలేకుండా అందరినీ పందిరిలా అల్లుకుపోయే మల్లెలు మగువలనే కాదు మనసున్న ప్రతీ ఒక్కరినీ కట్టిపడేస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వేసవికి ప్రకృతి అందించిన వరం ఈ మల్లెపూలు. ఈ సీజన్లో మల్లెపూలు తలలో తురుముకోని అతివలు ఉండరు లంటే అతిశయోక్తి కాదేమో!

**కోట్లాది రూపాయల అమ్మకాలు**

మల్లెలు విరగకాసే కాలం,మంచి దిగేబడినిచ్చే కాలం మార్చి నుంచి జూన్. ఈ నాలుగు నెలల్లో వీటి అమ్మకం కోట్లాది రూపయల మేర జరుగుతుందంటే ఆశ్చర్యమే. కృష్ణాజిల్లా, మైలవరం మండలంలోని సంత్రగూడెం, నందిగామ ప్రాంతంలో కంచల, జగ్గయ్యపేట ప్రాంతంలో షేర్మహ్మద్పేట, కె. అగ్రహారం తదితర

ప్రాంతాలతో పాటు కోస్తా జిల్లాల్లోనూ మల్లెలు విరివిగా పూస్తాయి. రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లోనూ కొన్ని చోట్ల వీటి దిగుబడి బాగానే ఉంటుంది. నర్సరీ రంగంలో ప్రసిద్ధి గాంచిన తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, కడియవులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్ ద్వారా మల్లెపూల అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. అతి సుందరమైన, సుకుమారమైన ఈ పూల ధర ఎప్పుడు ఎలా పెరుగుతందో చెప్పడం కష్టం మోజుతో మూడుకున్న బేరం ఇది. అప్పుడే కిలో రూ.2వేల పలుకుతుంది... అంతలోనే రూ. 500లకు పడిపోతుంది. ప్రాంతాలను బట్టి కిలో రూ. 300ల నుంచి రూ. 40లకు కూడా లభ్యమవుతాయి. పెళ్ళిళ్ళ సీజన్లో వీటి ధర అమాంతం ఆకతాశాన్ని అంటుతుంది. ఎలాంటి మహూర్తాలు లేకపోతే మల్లెల కిలో రూ. 25 నుంచి 30 లకు దొరికేస్తాయి. ఈ పువ్వులు ఎక్కువ సమయం నిల్వ వుండనందున కోసిన వెంటనే విక్రయాలు సాగిస్తూంటారు. పలు రాష్ట్రాలు, దేశాల్లోనూ అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో మల్లెల నుంచి అత్తర్లు, అగర్బత్తీలు, షాంపులు, పౌడర్లు వంటివి తయారుచేసి విక్రయిస్తున్నారు.

**సిరుల పంటతో నష్టాలూ ఉన్నాయి....**

ఎంత పరిమాళభరితమైన మల్లెకైనా జీవితకాలం కొద్దిగంటలే కావటంతో రైతులకు ఒక్కోసారి ఈ సేదపరిమళాలే మిగులుతున్నాయి. మనసును మరులు గొలిపే మల్లెలు కొందరికి ఆనందాన్ని, మరికొందరికి ఆహ్లాదాన్ని కలిగించినా మొగ్గను మల్లెగా చేసే రైతులకు మాత్రం కొన్ని సందర్భల్లో తీవ్ర నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. కొద్ది సేపు గుబాళించి వాడిపోయే ఈ మల్లెలు కొన్ని సమయాల్లో సిరుల పంట కురిపిస్తుంటాయి. ఆ ఆశతోనే రైతులు వీటిని సాగు చేయటానికి ముందుకు వస్తున్నారు. వీటిని కోయటానికి కూలీలు అధిక సంఖ్యలో అవసరం వుంటుంది. ఈ కారణంగానే, కోత కూలీ భారాన్ని తట్టుకోలేకే కొందరు రైతులు మల్లెలను సాగుచేయటానికి వెనుకాడుతున్నారు.

**నలభై రకాలు....!**

మల్లెలు ఎన్ని రకాలు ఉన్నయో తెలుసా? మనందరికీ మహా అయితే నాలుగైదు రకాలు తెలిసి ఉంటాయి వాస్తవానికి ఇవి మన ఊహకందని స్థాయిల్లో నలభై రకాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో అధికాంగా పందిరిమల్లిచ తుప్పుమల్లి, జాజిమల్లి కాగడామల్లి, నిత్యమల్లి వంటి వాటిని విరివిగా సాగు చేస్తుంటారు.

**కొండెక్కిన మల్లెధరలు**

గతంలో ఎన్నడూలేని రీతిలో వాటి ధర పెరగడంతో కొనడానికి వినియోగదారులు జంకుతున్నారు. పూల కొట్టు వద్ద మూర మల్లెపూలను రూ.30 నుంచి రూ.35కి, పూల మార్కెట్లో కిలో రూ.1000కి అమ్ముతున్నారు. గతంలో మూర రూ.10 నుంచి రూ.20లోపు, కిలో రూ.500 వనకూ ఉండేది. పండుగలు శుభకార్యాల సమయంలో మాత్రం కొంచెం డిమాండు ఉండేది. ప్రస్తుతం అవేమీ లేకపోయినా మల్లెపూల ధరలు షాక్ కొడుతున్నాయి. గతంలో రాష్ట్రంలో 12 వేల నుంచి 15 వేల ఎకరాల్లో మల్లె సాగు

- మిగతా 2 లో

## 30న తిరుపతిలో టీడీపీ భారీ సభ



ప్రత్యేక హోదా నినాదం హోరెత్తే విధంగా తిరుపతిలోఈ నెల 30న అధికారతెలుగుదేశం పార్టీ భారీబహిరంగ సభ నిర్వహించనుంది. 70 వేల నుంచి లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా టీడీపీ నేతలతో విజయవాడలో సమావేశమయ్యారు. జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేపట్టి తిరుపతి సభను విజయవంతం చేయాలన్నారు. సభ నిర్వహణ, ఏర్పాట్ల పరిశీలనకు మంత్రులు అచ్చెన్నాయుడు, నక్కాఆనందబాబు, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవులతో పాటు ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్యతోకమిటీని ఏర్పాటు చేశారు. సభ ఏర్పాట్లకు సంబంధించి మరికొన్ని కమిటీలు ఏర్పాటు చేయాలు ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. తిరుపతి సభతోశ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సభలు నిర్వహించనున్నారు. తిరుపతి సభతో ప్రత్యేక హోదా జనంలోకి మరింతగా వెళ్లాలని నాలుగేళ్లుగా ఏం జరిగింది? టీడీపీ ఏ విధంగా పోరాడుతోంది? అనే విషయాలను ఈ సభద్వారా తెలపాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం.

## 30న విశాఖలో 'వంచన వ్యతిరేక దీక్ష'

### వైసీపీ పిలుపు



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ప్రత్యేక హోదా విషయంలో సీఎం చంద్రబాబు మోసపూరిత విధానాలు, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 30న విశాఖపట్నంలో జరుపనున్న 'వంచన వ్యతిరేక దీక్ష'కు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వైసీపీ పిలుపు నిచ్చింది.ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక సర్క్యులర్ జారీ అయింది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి.. ముఖ్య నాయకులతో చర్చించి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, పార్లమెంటరీ జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు విశాఖపట్నంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు (12 గంటలు) జరిగే నిరాహార దీక్షలో నల్ల చొక్కా లేదా నల్ల టీషర్ట్ ధరించి పాల్గొనాలని సర్క్యులర్లో పేర్కొన్నారు.


దీక్షలో పాల్గొనబోయే నేతలందరూ ముందు రోజు, ఏప్రిల్ 29 సాయంత్రానికల్లా విశాఖపట్నం చేరుకోవాలని, ఉదయం 7 గంటల కంటే ముందుగానే జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని మహిళా కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా స్థలికి చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

# సివిల్స్లో సత్తాచాటిన తెలుగు తేజాలు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** సివిల్ సర్వీస్ పరీక్ష -2017 ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు మొత్తం తెలుగు రాష్ట్రాలకు చెందిన 8 మంది వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. యూపీపీఎస్సీ సివిల్ సర్వీస్-2017 ఫలితాలు విడుదల చేసింది. కరీంనగర్ జిల్లా చెందిన అనుదీప్ దూరిశెట్టి తొలిస్థానంలో నిలిచి తన సత్తా చాటగా, తెలుగు రాష్ట్రాల నుంచి మరో ఏడుగరు ర్యాంకులు సాధించారు.

శ్రీలం సాయితేజ 43వ ర్యాంకు, నారపురెడ్డి శౌర్య 100వ ర్యాంకు, మాధురి 144వ ర్యాంకు, వివేక్ జాన్సన్ 195వ ర్యాంకు, సాయి ప్రణీత్ 196వ ర్యాంకు, కృష్ణకాంత్ పటేల్ 607వ ర్యాంకు, అక్షయ్కుమార్ 624వ ర్యాంకు, భార్గవ శేఖర్ 816వ ర్యాంకు సాధించారు. వీరిలో సాయి ప్రణీత్ (196వ ర్యాంకు) సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ కుమారుడు కావడం విశేషం. మొత్తం 990 మంది పేర్లను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్తో పాటు గ్రూప్-ఎ, గ్రూప్-బి ఉద్యోగాలకు యూపీఎస్సీ ఎంపిక చేసింది. గతేడాది అక్టోబర్-నవంబర్ మధ్య మొయిన్స్ పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంటర్వ్యూలు నిర్వహించింది.

సివిల్ సర్వీస్ పరీక్ష -2017 ఫలితాలో అనుదీప్ మొదటి ర్యాంకు సాధించగా, రెండు, మూడు ర్యాంకులను అను కుమారి, సచిన్ గుప్తాలు సాధించారు. నాలుగో ర్యాంకు అతుల్ ప్రకాశ్, ఐదో ర్యాంకు కౌశిక్, ఆరో ర్యాంకు కోయ శ్రీహర్ష సాధించగా, ఏడు, ఎనిమిది ర్యాంకులను ఆయుష్ సిన్హా, అనుభవ్ సింగ్లు సాధించారు. ఇక తొమ్మిది, పది ర్యాంకులను సౌమ్య శర్మ, అభిషేక్ సురాలు వరుసగా ర్యాంకులు సాధించారు. మొదటి ర్యాంకు సాధించిన దూరిషెట్టి అనుదీప్ బిట్స్ ఫిలానీ నుంచి ఇంజనీరింగ్ ( ఎలక్ట్రానిక్ అండ్ ఇన్స్ట్రూమెంటేషన్ )లో డిగ్రీ పూర్తి చేశారు. 2015లో ఇండియన్ రెవిన్యూ సర్వీస్కు ఎంపికైన దూరిషెట్టి అనుదీప్...రెవిన్యూ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్గా విధులు



నిర్వహిస్తున్నారు. రెండో ర్యాంకు సాధించిన అను కుమారి సివిల్స్-2017 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన మహిళా అభ్యర్థి. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ (హానర్స్)లో డిగ్రీ పూర్తి చేయడంతో పాటు ఎంఐటీ-నాగపూర్లో ఎంబిఏ పూర్తి చేశారు.

**ద్వారకాతిరుమల అభ్యర్థికి 24వ ర్యాంకు**

సివిల్స్లో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమలకు చెందిన ఇమ్మడి పృద్వి తేజ సత్తా చాటాడు. జాతీయస్థాయిలో ఏకంగా 24వ ర్యాంకు సాధించాడు.కోచింగ్ లేకుండానే సొంతగానే పరీక్షలకు సిద్ధపడిన పృద్వి మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. పృద్వితేజ 2011 ఐఐటీలో జాతీయస్థాయిలో ప్రథమస్థానం సంపాదించాడు. దీంతో అప్పట్లో స్వయంగా సినీనటుడు పవన్ కల్యాన్ పృద్వితేజను హైదరాబాద్లో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 2015లో సామ్సంగ్ కంపెనీలో ఉన్నతోద్యోగంలో చేరారు. ఉద్యోగం ఐఐటీలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సంపాదించినప్పుడే ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నానని వివరించారు. పేదలు, గిరిజనులకు నిరంతరం సేవ చేయాలనే దృక్పథంతో ఉన్నానన్నారు.

**తెలుగు అభ్యర్థులు- సాధించిన ర్యాంకులు**

1. శీలం సాయి - 43, 2. నారపురెడ్డి మౌర్య - 100
3. జి. మాధురి - 144, 4. యెడవల్లి అక్షయ్ కుమార్ - 624
5. వివేక్ జాన్సన్- 195 6. సాయి ప్రణీత్ - 196 (సీబీఐ పూర్వజేడీ లక్ష్మీనారాయణ కుమారుడు)
7. భార్గవ శేఖర్ - 816 (అనంతపురం జిల్లా సోమవారవాండ్లపల్లి)

## సివిల్స్లో లక్ష్మయ్య స్టడీ సర్కిల్కు మొదటి ర్యాంకు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు(విద్య) :** యూపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన 2017 సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకులు డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా మెట్పల్లి ప్రాంతానికి చెందిన దూరిశెట్టి అనుదీప్ జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు, అదే విధంగా ఆయుష్ సిన్హా 7వ ర్యాంకు, శీలం సాయితేజ 43, వీఎన్ మణికంఠ చందోలు 206వ ర్యాంకు, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి కుమార్తె పనబాక రచన 929వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన వారిని డాక్టర్ లక్ష్మయ్య, స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.పద్మజారాణి అభినందించారు.

## ఏటా కోటి రూపాయల జీతాన్ని వదులుకుని...

### సివిల్స్లో 24వ ర్యాంకు సాధించిన పృధ్వీతేజ్

తల్లిదండ్రులు చిన్న కిరాణా షాపు నడుపుతున్నారు. కుమారుడు బాగా చదువుతున్నాడని స్తోమత లేకపోయినా, ఉన్నత చదువులు చదివించారు. వారి కష్టం చూస్తూ పెరిగిన కుమారుడు, ఏటా కోటి రూపాయల కొలువు సంపాదించాడు. ఇంకేం కావాలి! కానీ, ఏదో వెలితి! తన గమ్యం

- మిగతా 2 లో

## అంతర్జాతీయ ప్రమాణాలతో 'ది క్యాపిటల్' హోటల్

### గుంటూరులో నేడు ప్రారంభం



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** రాజధానిగానే కాకుండా ప్రపంచ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కార్పొరేట్ సంస్థ.. 'ది క్యాపిటల్ హోటల్' తొలిసారిగా బృందావన్ గార్డెన్స్లో ఏర్పాటు చేశారు. ఇప్పటికే రిటైల్ వ్యాపారంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'విజేత సూపర్ మార్కెట్' యాజమాన్యం తొలిసారిగా అతిథ్య రంగంలో ప్రవేశించింది. దానికి నవ్యాంధ్ర రాజధాని గుంటూరు నగరాన్ని ఎంచుకున్నారు. ది క్యాపిటల్ తన తొలి శాఖను బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఆదివారం ప్రారంభిస్తున్నా మని క్యాపిటల్ హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్మోహన్ తెలిపారు.

ఈ హోటల్లో 42 రూమ్స్తో పాటు, రెండు రెస్టారెంట్లు, రెండ్ బాంక్వెట్లున్నాయి. దీంతో పాటు ది బీన్ హౌస్ పేరుతో కాఫీ షాప్ ప్రత్యేకత. విదేశాలో ట్రైన్డ్ చెఫ్స్తో ది విన్టేజ్ కిచెన్, ది క్యాపిటల్ కోర్ట్ యార్డ్ పేరుతో బ్యాన్కెట్ హాల్, ది జ్యూవెల్ ఆఫ్ లైఫ్ పేరుతో స్మాల్ బ్యాన్కేట్ హాల్ ఇలా ఎన్నో సదుపాయాలున్నాయి. నగరంలోనే అతిపెద్ద పార్కింగ్ సదుపాయం దీని ప్రత్యేకతన్నారు. గుంటూరు ఎంపీ గల్లాజయదేవ్, పర్యాటక మంత్రి భూమా అఖిల ప్రియ, మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.



విజయవాడ బీసెంట్ రోడ్డులో రామ్రాజ్ షోరూంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కళాతపస్వి విశ్వనాథ్

- 2 లో

## జాగ్రత్తలు పాటించండి : కృష్ణానంద్



ఎండా కాలంలో అగ్నిప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెలగపూడి అగ్నిమాపక అధికారి కె. కృష్ణానంద్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములకు ఇళ్లకు మధ్య 60 అడుగుల దూరం ఉంచాలని, అలాగే ఒక్కటే పెద్ద గడ్డివాముకాకుండా చిన్న చిన్న గడ్డివాములను ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. ఒక్కటే ప్లెగ్ నుంచి అనేక విద్యుత్ వైర్లను వాడకూడదని, ట్రాక్టర్లు, తాటాకు ఇళ్లవద్ద పెళ్లిళ్ల టపాసులు పేల్చరాదని ,ఇళ్లల్లో కిరోసిన్ను నిల్వఉంచరాదని కృష్ణానంద్ కోరారు. ఇంటిలోని గ్యాస్స్టౌలను పూర్తిగా సరిచూసుకోవాలని వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా నీటిని దగ్గర ఉంచుకోవడం మంచిదన్నారు. పంటలు కోసిన తర్వాత వాటిని తగులబెట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.



# రాజధాని వార్తలు

కలం

## మోడీ ప్రభుత్వానికి న్యూయార్క్‌టైమ్స్ అక్షింతలు

ప్రధాని మోడీ గొప్ప వక్త, దార్శనికుడు, అభివృద్ధికి చిరునామా.. కావాలంటే గుజరాత్ అభివృద్ధి చూడండి అంటూ బీజేపీ డప్పాలు కొట్టింది. అంతేకాదు మోడీ వచ్చిన తర్వాతే ప్రపంచ దేశాల్లో భారత్ ప్రతిష్ట మరింత పెరిగిందని కూడా ఏకరువు పెట్టింది. అయితే వాస్తవ పరిస్థితి అలా లేదు. మోడీ రాగానే గోరక్షక దళం పేరుతో ముస్లిం మైనార్టీలను, చనిపోయిన ఆవుల చర్మం తీస్తున్న గోహత్యకు పాల్పడ్డారని ఎస్సీలను దారుణంగా హింసించి, చంపడం వంటి కార్యాలు ప్రపంచ దేశాలకు తెలిసి ఈ ప్రభుత్వంపై ఏహ్య భావన పెంచుకున్నాయి. జాతీయవాదం పేరుతో మతోన్మాదాన్ని మహిళలను, పిల్లలపై అఘాయిత్యాలతో బీజేపీ పరువు బజారుకెక్కింది. అనవసర ప్రసంగాలు అధికంగా చేసే మోడీ, దేశం మొత్తం నిరసన ఆందోళనలు చేపట్టినప్పుడు మాత్రం మౌనమునిలా మారిపోతారు. దీంతో ఇటీవల అమెరికా పర్యటలో ఉన్న మోడీకి నిరసన ఆందోళనలు ఎదుర్కోవలసి వచ్చింది. బీజేపీ నేతలు అసహనానికి పాల్పడ్డప్పుడు దేశంలోని మేధావులంతా తమతమ ప్రతిభా అవార్డులను వెనక్కు పంపిన సమయంలో కూడా అమెరికా విలేకరులు దేశ పరిస్థితులపై బీజేపీ నాయకుల అసహనంపై గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేసి మోడీకి చుక్కలు చూపారు. అయితే ప్రస్తుతం దేశంలోని పరిస్థితులు మరింత దిగజారి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు రేప్ కేసుల్లో విచారణ ఎదుర్కోవడంపై ప్రముఖ అంతర్జాతీయ పత్రిక న్యూయార్క్ టైమ్స్ మోడీ ప్రభుత్వాన్ని తూర్పార పడుతూ ఎడిటోరియల్ రాయడంతో బీజేపీ ఎంత సొంత డబ్బా కొట్టుకున్నా వాస్తవ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది.

జమ్మూకాశ్మీర్‌లో హిందువుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో సంచార ముస్లిం బకర్వాల కుటుంబానికి చెందిన, 8 ఏళ్ల అమ్మాయిని అధికారులు పోలీసులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగితో సహా 8 మంది అత్యంత దారుణంగా హిందూ దేవాలయంలో అత్యాచారం జరిపి ఆపై బండరాళ్లతో మోది చంపడం దేశ ప్రజల్లో ఆగ్రహజ్వాలలు రేపింది. ఈ నేరానికి మతాన్ని పులిమి, నిందితుల తరుపున ఇద్దరు కాశ్మీర్ మంత్రులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించడం, నిందుతులపై నేరం నమోదు చేయరాదంటూ బార్ కౌన్సిల్ అడ్డుకోవడం దేశపరువును మంటగలిపిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో మైనర్‌పై ఎమ్మెల్యే , ఆయన సోదరుడు అఘాయిత్యానికి పాల్పడటం, అంతేకాకుండా, ఇదేమని ప్రశ్నించినందుకు తండ్రిని గుండాలతో కొట్టించడమే కాకుండా తప్పుడు కేసుతో జైల్లో పెట్టించి హత్య చేయించడంతో దేశవ్యాప్తంగా నిరసన పెల్లుబికింది. మూడేళ్ల బీజేపీ ప్రభుత్వంలో లక్షమంది పసివారు అత్యాచారాలకు గురయ్యారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. 2012లో నిర్భయను తేలిగ్గా తీసుకున్నందునే కాంగ్రెస్ పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని మోడీ ఆ విషయాన్ని మరిచిపోకూడదని సంపాదకీయం హెచ్చరించింది. ఏది ఏమైనా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం తన ఉనికిని కోల్పేయే ప్రమాదంలో ఉండటం దురదృష్టకరం.

## బ్యాంకుపై సడలుతున్న నమ్మకం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** బ్యాంకుపై ప్రజలకు నమ్మకం సడలింది. ఫలితంగా గడిచిన మూడు నెలల్లో రాష్ట్రంలో సుమారు రూ.32,000 కోట్ల డిపాజిట్లను ఖాతాదారులు వెనక్కి తీసుకుని ఉండవచ్చునని బ్యాంకు అధికారులు అంచనా వేస్తున్నారు. ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు, వరుసగా వెలుగు చూస్తున్న కుంభకోణాలతో బ్యాంకులు విశ్వాసాన్ని కోల్పోతున్నట్లు ఆర్థికరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనికితోడు డిపాజిట్లపై వడ్డీ రేట్లు రోజురోజుకీ తగ్గిపోతుండటం, అవసరాకు సొంత డబ్బు తీసుకోవాలన్నా నగదు కొరతతో బ్యాంకులు ఆంక్షలు పెడుతుండటంతో బ్యాంకులలో డిపాజిట్లు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే ఈ మార్చి నాటికి మొత్తం డిపాజిట్ల విలువ రూ.2,70,432 కోట్లుగా ఉంది. బ్యాంకుల నుంచి గత రెండు నెలలుగా డబ్బులు బయటకు వెళ్లడమేగానీ ఒక్క రూపాయి కూడా వెనక్కి రావడం లేదని ప్రభుత్వరంగ బ్యాంకు అధికారి వివరించారు. అలాగే గతంలో ప్రతి బ్యాంకు శాఖకు సగటున రూ.10 లక్షల వరకు రెండు వేల నోట్ల వచ్చేవని, ఇప్పుడా సంఖ్య రూ.4 లక్షలకు పడిపోయిందని బ్యాంకు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

**ఈసారి వృద్ధి 3శాతానికే..**

గత మూడేళ్లుగా డిపాజిట్లలో రెండుంకెల వృద్ధి రేటు నమోదవుతూ వస్తోంది. పెద్ద నోట్ల రద్దు చేసిన ఏడాది 2016-17ఓ ఏకంగా 20.43శాతం వృద్ధి నమోదయ్యింది. ఆ ఏడాది డిపాజిట్లు భారీగా పెరిగి రూ.2,62,556 కోట్లకు పెరిగాయి. కానీ, 2017-18లో డిపాజిట్ల వృద్ధి రేటు మూడు శాతానికి పరిమితమవుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 8 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటే 3 శాతం వృద్ధితో రూ.2,70,432 కోట్లకు పరమితమవుతుందని అంచనా వేస్తున్నట్లు ఎస్ఎల్‌బీసీ అధికారులు వివరిస్తున్నారు. ఇదే సమయంలో రుణాలు రూ.2.80 లక్షల కోట్లుకు చేరుతాయని అంచనా వేస్తున్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో డిపాజిట్ల కంటే రుణాల మొత్తం ఎక్కువగా ఉంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం క్రెడిట్ డిపాజిట్(సీడీ) రేషియో 60 శాతం ఉండాల్సి ఉండగా గడిచిన నాలుగేళ్లుగా ఈ నిష్పత్తి సగటున 107 శాతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో డిపాజిట్లపై దృష్టి సారిచాల్సిందిగా ఆర్‌బీఐ సూచించినట్లు అధికారులు పేర్కొన్నారు.







## సంక్షేమంపై సమ్మెట

- అసాధారంగా నగదుకొరత
- ఖాళీ గా ఉన్న ఏటీఎమ్‌లు
- మళ్లీ నోట్లరద్దునాటి పరిస్థితి

**అమరావతి/హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నగదుకొరత సంక్షేమంపై తీవ్రప్రభావాన్ని కలుగజేసింది. పనులు చేసేవారికి ఏ రోజుకారోజు డబ్బు చెల్లించవలసి ఉంటుంది. కాంట్రాక్టర్ల వద్ద డబ్బు లేకపోవడంతో రోజువారీ వేతనాలు చెల్లించే అవకాశం లేకుండా ఉంది. అన్ని నగరాలు, పట్టణాల్లో బ్యాంకులలో, ఏటీఎమ్‌లలో నగదులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ మాత్రం కావలసినంత నగదు చలామణిలో ఉందని ప్రకటన చేయడం ద్వారా అపహాస్యం పాలయ్యారు. రూ.2000 నోట్లు మార్కెట్‌లో కనిపించడంలేదు. కారణాలు ఏమిటని జనం తీవ్రంగా చర్చించుకుంటున్నారు. డబ్బుకోసం తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ఇంతవరకు రాష్ట్రానికి నగదు రాలేదు. కార్మికులు ఎక్కువగా పనిచేసే అన్ని పథకాల అమలు కుంటుపడింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడివక్కడ నిలిచిపోయే అవకాశం ఉంది. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పన పనులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు తెలంగాణ వంటి చోట్ల మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, రోడ్ల నిర్మాణం పనులు ఎక్కువగా కుంటుపడ్డాయి. పూర్తికావలసిన పనులు ఈ దశలో నిలిచిపోతే మళ్లీ వాటిని పూర్తిచేసేందుకు కాలం గడిచేకొద్దీ ఖర్చులు పెరుగుతాయి. నగదు లేకపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడమే కాక రెవెన్యూ వసూళ్లపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మరోవైపు నాసిక్‌లోని ముద్రణాలయంలో ఇంకు కొరత కారణంగా నోట్ల ముద్రణ ఆగిపోయిందని కరెన్సీ నోట్ ప్రెస్ యూనియన్ తెలియజేసింది. ఇంకు లేకపోవడంతో రూ.200,రూ.500 నోట్ల ప్రింటింగ్ ఆగిందని యూనియన్ అధ్యక్షుడు జగదీశ్ గాడ్సే తెలిపారు. రూ.2000నోట్లు మినహా తక్కిన అన్ని విలువగల నోట్లను ఇక్కడ ముద్రించే ఏర్పాటు చేస్తారని పేపర్ కూడా కొరత ఉందని ఆయన అన్నారు. నోట్ల ముద్రణ ఎప్పటి నుండిఆగిపోయిందనే అంశం ఆయన చెప్పలేదు. ఎస్‌బీఐ నగదును కొరత గా ఉన్న రెండురాష్ట్రాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని తెలియజేసింది. నగదు నిర్వహణ కమిటీని ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఎస్‌బీఐ నియమించింది. ఏ రాష్ట్రంలో ఎంత నగదు ఉంది. ఎక్కడ కొరత ఉంది. అనే అంశం ఆయా బ్యాంకులు రోజువారీగా అందించే సమాచారం వల్ల తెలుస్తుంది. కదా...అయినప్పటికీ కొరత ఏర్పడిన తర్వాత కూడా ఆర్‌బీఐ కానీ కేంద్ర ప్రభుత్వంకానీ సక్రమంగా స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు.

## సివిల్స్‌లో సత్తాచాటిన తెలుగు తేజాలు

(మొదటిపేజీ తరువాయి)

సివిల్స్ అని తెల్చుకొని, తల్లిదండ్రులకు ఆ విషయం చెప్పాడు. 'కోటి ఆశలు' పండిస్తాడనుకొన్న కుమారుడు అలా మాట్లాడితే ఎవరైనా ఏం అంటారు! కానీ, ఆ తల్లిదండ్రులు తటపటాయింపు లేకుండా కుమారుడిని ఆశీర్వదించి పంపారు. ఇప్పుడు సివిల్స్ కొట్టి తమ ఎదుట నిలబడిన కుమారుడిని చూసి మురిసిపోయారు. అతడే.. పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలకు చెందిన యిమ్మడి ప ృథ్వీతేజ్. సివిల్స్‌లో 24వ ర్యాంకు సాధించాడు. తక్కువ వయస్సులో సివిల్స్ సాధించిన వ్యక్తిగానూ(23 సంవత్సరాలు) మన్ననలు అందుకుంటున్నాడు. తన తల్లిదండ్రులు యిమ్మడి శ్రీనివాసరావు, రాణిల కష్టమే తనను ఈ స్థాయికి చేర్చిందని ప ృథ్వీతేజ్ తెలిపారు. చదువులో ప ృథ్వీతేజ్ వరుస విజయాలతో దూసుకెళ్లాడని సహచరుడు గుర్తు చేసుకొన్నారు. పృథ్వీతేజ్ ఐఐటీ ఎంట్రన్స్ పరీక్ష రాసి ఆలిండియా ప్రథమ ర్యాంకు



సాధించారు. ముంబైలో బిటెక్ పూర్తి చేశారు. ఉత్తర కొరియాలోని శ్యామ్‌సంగ్‌లో ఒక ఏడాదిపాటు ఉద్యోగం చేశారు. ఏడాదికి కోటి రూపాయల జీతానికి అక్కడ పనిచేశారు. సివిల్స్ కొట్టాలన్న లక్ష్యంతో ఆ ఉద్యోగాన్ని వదులుకున్నారు. సొంతంగానే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. అనుకున్నది సాధించారు.

**సివిల్స్‌లో సత్తాచాటిన సీబీఐ మాజీ జేడీ తనయుడు**

జూబ్లీహిల్స్ (హైదరాబాద్): సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కుమారుడు సాయిప్రణీత్ సివిల్స్-2017 ఫలితాల్లో సత్తాచాటాడు. తొలి ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 196వ ర్యాంకు సాధించాడు. ఏడో తరగతి వరకు మహారాష్ట్రలో చదివిన సాయిప్రణీత్.. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని భారతి విద్యాభవన్‌లో 10వ తరగతి చదివాడు. రాజస్థాన్‌లోని బిట్స్‌పిలానీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. 2017లో తొలి ప్రయత్నంలోనే ఈ ర్యాంకు సాధించడంతో లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాయిప్రణీత్ తండ్రి లక్ష్మీనారాయణ, తల్లి ఊర్మిళ, సోదరి సాయినిత్య కేకు కోసి ఆనందాన్ని పంచుకున్నారు.

## రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** కాటన్ వస్త్రాలకు పేరెన్నికగన్న రామ్‌రాజ్ షోరూంను విజయవాడ బీసెంట్ రోడ్డులో ప్రారంభించారు. కళాతపస్వి విశ్వనాథ్ ఈ షోరూంను ప్రారంభించారు. దక్షిణ భారత దేశంలో ఈసంస్థకు చెందిన చాలా షోరూమ్‌లు ప్రారంభించాని ఇది తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తానని ఆయన వెల్లడించారు. ధోతీలు, షర్టులకు ఇది పేరెన్నికగన్న సంస్థగా ఆయన అభివర్ణించారు. ఈ సంస్థతో అనేకమంది చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ఆంధ్రాలో మొదటి షోరూం తిరుపతిలో ఉండగా ప్రస్తుతం విజయవాడలో కూడా ప్రారంభించామన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాలమైన తమిళనాడులోకూడా ఈ షోరూంలను ప్రారంభిస్తామని మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ నాగరాజ్ తెలిపారు. రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలను శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. తమవద్ద సుగంధ, శుభముహూర్త, ధోతీలు, కాటన్ షర్టులతోపాటు ముడతలు పడని చొక్కాలు, లినెన్, శుభముహూర్త షర్టులు ఉన్నాయన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధానికి చేరువలో ఈ షోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందని నాగరాజ్ వెల్లడించారు.

### అసత్య ప్రచారంపై విజ్ఞాన్ వర్సిటీ ఫిర్యాదు

**రాజధాని ప్రతినిధి, గుంటూరు:** సోషల్ మీడియాలో విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీపై జరుగుతున్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వీసీ డాక్టర్ ఎంవైఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ ఫిర్యాదుపై చేబ్రోలు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని, బాధ్యులను గుర్తించే పనిలో ఉన్నారని తెలిపారు. తమ విశ్వవిద్యాలయం క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. మద్యపాన, ధూమపానం లాంటి విషయాల్లో తాము అత్యంత కఠినంగా ఉంటామని వివరించారు. విజ్ఞాన్ సంస్థలు నాలుగు దశాబ్దాల నుంచి క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠ ఉన్న తమ సంస్థపై అసత్య ప్రచారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విశ్వసించవద్దని ఆయన విజ్ఞప్తిచేశారు.

### రాజధాని నిర్మాణ పనుల్లో అపశ్రుతి

**రాజధాని ప్రతినిధి, గుంటూరు:** ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ పనుల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. రోడ్డు నిర్మాణం కోసం తీసిన నీటి గుంటలో పడి ముగ్గురు చిన్నారులు మ ృతి చెందారు. నీటి ఊబిలో చిక్కుకున్న మరో ఏడుగురిని స్థానికులు రక్షించారు. తుళ్లూరు మండలం దొండపాడు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మ ృతులు ఉప్పలపాటి అమల (9), రమేష్ (8), బండి సాత్విక్ (6)గా తెలుస్తోంది. కళ్లముందు ఆడుతూ తిరిగి చిన్నారులు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఇది మల్లెల వేళ....

(మొదటిపేజీ తరువాయి)

జరిగేది. ప్రస్తుతం 7 వేల ఎకరాలకే పరిమితమైంది. రాజధాని పరిధిలో ఉన్న మండలంలో నిడమర్రు, కురగల్లు, బేతపూడి మల్లె సాగుకు పెట్టింది పేరు. గతంలో ఈ మూడు గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో మల్లె తోటలుండేవి. ప్రస్తుతం అది700 ఎకరాలకు పడిపోయింది.



నిడమర్రులోనే గతంలో1500 ఎకరాల్లో మల్లె తోటలుండేవి. ప్రస్తుతం 500 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ ఏడాది వాతవరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గిందని రైతులు అంటున్నారు.గతంలో ఎకరానికి వెయ్యి క్వింటాలు మల్లెపూల దిగుబడి వచ్చేదని, కానీ ఇప్పుడు తగ్గిందని చెబుతున్నారు.ఇదివరలో తోటల రైతులు కిలో మల్లె పూలను రూ.200కివ్యాపారులకు అమ్మేవారు. వ్యాపారులు పూల కొట్లకు రూ.300 నుంచి రూ.400కి విక్రయించేవారు. మూర ధర రూ.10, రూ.15 ఉండేది. కానీ తోటలు తగ్గిపోవడంతో డిమాండ్ పెరిగి పోయింది. గతంలో విజయవాడ, గుంటూరు తోపాటు హైదరాబాద్, బెంగళూరుకు ఇక్కడినుంచే పూలు పంపేవారు. ప్రసుతం విజయావాడకే పూలు సరఫరా చేస్తున్నారు. రాష్ట్రంలో వడ్లపూడి, చీరాల మైలవరం, నందికొట్కూరు ప్రాంతాల్లో మల్లె సాగు జరుగుతున్నా డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో రేటు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

## లక్ష మందిని చిదిమేశారు

**న్యూఢిల్లీ :** దేశంలో రెండు ప్రాంతల్లో లైగింకదాడి ఘటనలు వెలుగుచూశాక.. జనంలో ఆగ్రహవేశాలు పెల్లుబుకుతున్నాయి. చిన్నా పెద్దా అనే తేడాలేకుండా పసిమొగ్గల నుంచి మొదలుపెడితే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని గళమెత్తారు. ఎట్టకేలకు మోడీ సర్కారు దిగివచ్చింది. 12 ఏండ్ల చిన్నారులపై లైంగికదాడికి పాల్పడితే మరణశిక్ష విధించేలా పోక్సో చట్ట సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆబోదం తెలిపింది. మహిళా శిశుసంక్షేమశాఖ సేకరించిన నివేదిక ప్రకారం 2014 నుంచి 2016 మూడేండ్ల లక్షమంది చిన్నారులపై లైంగిక, సామూహిక లైంగికదాడి ఘటనలు జరిగాయని ధ్రువీకరించింది. కాగా శిక్షలు మాత్రం కేవలం పదిశాతం మందికే పడినట్టు రికార్డుల్లో ఉన్నది. దీనిబట్టి చూస్తే దారుణాలకు పాల్పడేవారు స్వేచ్ఛగా బయటకు వచ్చేస్తున్నారు. అందుకే నేరాలు నిత్యకృత్యం అవుతున్నాయి.

**నరేంద్రమోడీ ప్రధాన అయ్యాక....**

ఈ మూడేండ్లలో 1,04,976 లైంగిక దాడులు, సామూహిక దాడుల ఘటనలు నమోదయ్యాయి. వీటిలో కేవలం 11,266 మందికి మాత్రమే



శిక్షలుపడ్డాయి. 2016లో పసిమొగ్గలపై పైశాచికానికి దిగిన 42,160 మందిని అరెస్టు చేశారు. వాస్తవానికి చిన్నారులపై జరిగిన దారుణాలకు సంబంధించి బయటకు వచ్చి నమోదు చేసిన కేసులు చాలా తక్కువేనని మహిళా సంఘాలు అంటున్నాయి. పోలీసులు, కామాంధులతో లాలూచీపడటమో.. లేక రాజకీయ ప్రభావంతో కూడా లైంగికదాడి కేసులు రికార్డులకెక్కటం లేదని కూడా వారు అభిప్రాయపడుతున్నారు. ఇక 2017లో సామూహిక లైంగికదాడి ఘటనలు మరింతగా

- మృగాళ్ల కిరాతకానికి నలిగిన పసి మొగ్గలు
- మూడేళ్లుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రెచ్చిపోతున్న కీచకులు
- పదిశాతం మందికే శిక్షణ

పెరిగాయని విశ్లేషిస్తున్నారు. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల్లో పసిమొగ్గలపై మానవత్వం ముసుగులో కామాంధుల ఆగడాలకు అంతులేకుండా పోతున్న ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇక కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు లైంగికదాడి ఘటనలతో పాటు క్లిష్టమైన సమస్యలు ఎదురైనపుడు ప్రధాని మోడీ విదేశాలకు వెళ్లటం తమ దేశంలో ఎలాంటి సమస్యలు లేనట్టుగా ప్రచారం చేసుకోవటం సర్వసాధారణమైపోయిందని విపక్షపార్టీలు ఆరోపిస్తున్నాయి. చట్టాలను సవరించినా. అసలు కోరల్లేకుండా చేస్తున్న మోడీ సర్కారుకు నేరాలను అరికట్టడంలో చిత్తశుద్ధి ఎంత అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## దుల్హాన్ పథకానికి మంగళం

- పేద ముస్లిం అమ్మాయిల పెళ్ళికి ప్రత్యేకం
- ఇక నుంచి చంద్రన్న పెళ్ళికానుకలో అమలు
- 20 లోపె పెళ్ళి చేసుకున్న వారికే పాత పథకం

**విజయనగరం :** పేద ముస్లింల ఇళ్ళల్లో అమ్మాయి పెళ్ళికి ఆర్థికం ఆదుకోవాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన దుల్హాన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వ మంగళం పాడుతోంది. మూడేళ్ళపాటు మైనారిటీశాఖ ద్వారా అమలుచేసిన ఈ పథకాన్ని ఇకపై ఆపేస్తున్నట్టు ఉత్తర్వులను జారీ చేసింది. ముస్లింలకు ఇచ్చే ఆర్థిక సహకారం ఇక నుంచి చంద్రన్న పెళ్ళి కానుకలో అన్ని కులాల మాదిరిగా అముచేయాలని ఆదేశాఉ జారీచేసింది. దీంతో దుల్హాన్ పథకం చంద్రన్న పెళ్ళి కానుకలో విలీనమైంది. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2015 ఏప్రిల్ నెలలో పేద ముస్లింలను ఆదుకునేందుకు దుల్హాన్ పథకం ప్రవేశ పెట్టారు.



పేదరికంతో బాధపడుతున్న ముస్లిం కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహానికి ఈ పథకం ద్వారా రూ.50 వేలను ప్రభుత్వం సహాయంగా అందజేసింది. ఈ పథకం నిర్వహణ బాధ్యతలను ఆయా జిల్లాల మైనారిటీ సంక్షేమశాఖకు అప్పగించింది. అర్హులైన ముస్లింల దరఖాస్తుల ఈ శాఖ ఆధ్వర్యంలో విచారణ చేసిన అనంతరం వారి బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ అయ్యేది. ముస్లింలు ఎంతో సంతోషించిన ఈ పథకం మూడేళ్ళ ముచ్చటగా కనుమరుగైంది. ఈ పథకం నిలిపివేయడంతో ఇకపై దరఖాస్తులను తీసుకోవద్దని ఆయాశాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**పేద ముస్లింలకు అండగా..**

విజయనగరం జిల్లాలో 2015 నుంచి ఇప్పటివరకు దుల్హాన్ పథకానికి 152 పేద ముస్లిం కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. 115 మందికి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసింది. 37 మందికి సహాయం అందాల్సి ఉంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు ఈ నెల 20వ తేదీ లోపు పెళ్ళి అయినవారికి మాత్రమే పాత పద్ధతిలో మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి సహాయం అందనుంది. జిల్లాలో 37 పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి 20లోపు వివాహమైన వారికే సహాయం అందుతుందని మైనార్టీ సంక్షేమశాఖ ఎండీ అన్నపూర్ణమ్మ తెలిపారు.

# కలల సాకారానికి ఒడివడిగా అడుగుల వేస్తూ ..

## స్ఫూర్తిగా నిలుస్తున్న అనితా సెంథిల్ విజయగాథ...



మారుమూల పల్లెల్లోంచి వచ్చేవారి ఆలోచనలు, ఆశయాలు ఆ పల్లెల్లాగే చిన్నగా ఉంటాయంటారు. కానీ అనితా సెంథిల్ అలా కాదు పుట్టిన ఊరు చిన్నదే అయినా.... కలలూ, లక్ష్యాలన్నీ పెద్దపెద్దవే. లక్షసాధనలో ఓ మహిళగా ఎలాంటి అడ్డంకులు ఎదుర్కోలేదు. ఆమె లక్ష్యానికి సంసార జీవితం ప్రతిబంధకం కాలేదు. అన్నింటినీ బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్తున్న ఆమె జీవితం అందరికీ ఓ పాఠమే. ఇంతకీ ఎవరా అనితా సెంథిల్? ఏం సాధించారు? తెలుసుకుందాం...

నా ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు. ఆ సంఘర్షణ నుంచి, ఆ తప్పుల నుంచి చాలా నేర్చుకున్నా, ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తూ వ్యాపార మెళకువలను నేర్చుకున్నా, మార్కెట్‌ను అధ్యయనం చేయడం ఎంతగానో ఉపయోగపడింది. నేను ఇదంతా ఎందుకు చేస్తున్నాను..? నా కాంపిటీటర్స్ ఎవరు? ఎలా ముందుకెళ్లాలి? లాంటి చాలా ప్రశ్నలకు నాకు సమాధానం దొరికింది.

**చిన్న గ్రామం నుంచే తొలి అడుగులు**

కేరళలోని పాలక్కడ్ జిల్లాలో ఆమెది ఓ చిన్న గ్రామం. అక్కడి దిగువ మధ్యతరగతి చెందిన దంపతుల కుమార్తై అనితా సెంథిల్. సాధారణంగా పల్లెటూరి అమ్మాయిలంటే...ఇంటి ఖర్చుల లెక్కలు రాసుకునేంత చదువుంటే చాలన్న అపోహ ఉంటుంది. ఆ తర్వాత పెళ్లి... ఇదే వారి జీవితం. కానీ అనితా సెంథిల్ జీవితం అలా కాదు. తరచి చూస్తే చాలా కనిపిస్తుంది. ఆమె ఆశయాలకు తల్లిదండ్రులు ఏనాడూ అడ్డు చెప్పలేదు. నచ్చిన కెరీర్ ఎంచుకోవాలని ప్రోత్సహించారు. పూర్తి సహకారం అందించారు. పాలక్కడ్‌లో స్కూల్ చదువులు పూర్తి చేసుకున్న తర్వాత డిగ్రీ, పీజీ కోసం కొయంబత్తూర్ వెళ్లారు. అనిత. గ్రాడ్యుయేషన్ తర్వాత 2008లో చెన్నైలో బీపీఓ సెక్టార్‌లో అడుగుపెట్టారు. ఇక్కడ లభించిన జ్ఞానం, అవగాహన ఆమెకు జీవితంలో కీలకంగా మారింది. కన్నతల్లి లాంటి సొంతూరిని, ఆ ఊళ్లో ఉండే తల్లిదండ్రుల్ని విడిచి దూరంగా ఉండటమంటే పెద్ద సవాలే. ఎంతో మానసిక సంఘర్షణ ఉంటుంది. కుటుంబానికి దూరంగా నెలలు నెలలు ఉండటం చాలా కష్టం. అనిత కూడా అంతే. తల్లిదండ్రుల్ని విడిచి ఎక్కువ రోజులు ఉండలేకపోయారు.

2009లో ఉద్యోగాన్ని వదిలి పెట్టి సొంతూరికి తిరిగివెళ్లారు. అక్కడే ఏదైనా చెయ్యాలని నిర్ణయించుకున్నారు. అక్కడ ఓ ఉద్యోగంలో చేరారు. కానీ ఆ ఉద్యోగం అంత సంతృప్తినివ్వలేదు. అప్పుడే ఆన్‌లైన్ కెరీర్ వైపు అడుగులు వేశారు.

ఫ్రీలాన్స్ కంటెంట్ ప్రొడ్యూసర్‌గా విద్యారంగంలో అడుగుపెట్టారు. అందులోనూ సవాళ్లే. కానీ ఎదుర్కొనే కష్టాలు, సమస్యలు మనిషిని మరింత రాటుదేలుస్తాయి. తన విషయంలో అదే జరిగింది. కెరీర్‌లో ముందుకెళ్తున్నకొద్దీ ఆమె ఎంతో ధైర్యాన్ని కూడగట్టుకున్నారు. 2012లో coursegig.com ని ప్రారంభించారు. ప్రొఫెషనల్ స్టడీ మెటీరియల్ అందించే వెబ్‌సైట్ ఇది. మెటీరియల్ మాత్రమే కాదు... ఆన్‌లైన్ ట్యూటర్స్‌ని కూడా అందించిన ఘనత ఈ వెబ్‌సైట్‌ది. ఆ తర్వాత 2014లో ఎంబీఏ పూర్తి చేశారు. ఎంబీఏ చదువు ఆమెకు కొండంత ధైర్యానిచ్చింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవించేందుకు కావాల్సిన నైపుణ్యం లభించింది. లక్ష్యాలు సాధించడంలో పురుషులతో పోలిస్తే మహిళలకు ఆటంకాలు ఎక్కువ. మహిళలకు పెళ్లి, పిల్లలు, సంసారం లాంటి ప్రతిబంధకాలు ఉంటాయి. కానీ ఇవేవీ తన కలలకు,




అభిరుచికి, వెంచర్‌కు ఏమాత్రం అడ్డంకి కాలేదని గర్వంగా చెబుతారు అనిత. "కుటుంబంతో నిత్యం తీరికలేకుండా ఉంటామని నా స్నేహితులు చెబుతుంటారు. ఏమీ చేయడానికి సమయం దొరకట్లేదంటారు. కానీ బ్యాలెన్స్ పాటిస్తే ఏదైనా మేనేజ్ చేయొచ్చు. ఇప్పటికీ నా తర్వాత అడుగు ఏంటీ అని నేను నిత్యం ఆలోచిస్తునే ఉంటాను. కొత్త లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలని ప్రణాళిక రూపొందిస్తుంటాను. ఇదంతా నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. ఎంతో శక్తినిస్తుంది. ఆశావాద దృక్పథంతో ఉండేందుకు తోడ్పడుతుంది" అని గర్వంగా చెబుతారు.

ఆ ధైర్యంతోనే రెండేళ్ల కిందట అనిత అతిపెద్ద ప్రాజెక్టుని ప్రారంభించారు. కొచ్చిన్‌లో కీవేస్ ఎద్యు సర్వీసెస్‌కు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం coursegig.com, academicpaperhud.com రెండు వెబ్ సైట్లను కీవేస్ ఎద్యు సర్వీసెస్ గొడుగు కిందకు తీసుకొచ్చారు. కొన్నాళ్ల తర్వాత పేపర్స్ తయారుచేయడంపై దృష్టిపెట్టనున్నారు. తన టీమ్ గురించి చాలా గొప్పగా చెబుతారు అనిత.

"నాకు చాలా మంచి టీమ్ ఉంది. వాళ్లు నాకు అన్ని విషయాల్లో అండగా నిలిచారు. ముగ్గురు ఉద్యోగులు నాకు నిత్యం సహకరిస్తుంటారు. ఇక మిగతా వాళ్లంతా ఫ్రీలాన్సర్స్, వీళ్లతోనే నేను అన్నీ మేనేజ్ చేసుకోగలుగుతున్నా" అంటారు. అనితా.

ఇంటర్నెట్, టెక్నాలజీ ద్వారా విద్యార్థులు వారి లక్ష్యాలు చేరుకోవడానికి సాయపడుతున్నారు. విద్యార్థులను విద్యావంతుల్ని చేయడానికి, వారి విద్యాప్రమాణాలు పెరగడానికి, భవిష్యత్తు చక్కగా తీర్చిదిద్దుకోవడానికి ఆన్‌లైన్ సపోర్ట్ ఇవ్వడమే మా అంతిమ లక్ష్యం.

కలాం స్ఫూర్తితో ముందడుగు

ఒక పారిశ్రామికవేత్తగా తన సర్కిల్ ను పెంచుకోవడానికి, వేర్వేరు వర్గాలతో కలిసిపోయేందుకు అనితా ఎప్పుడూ ఇబ్బందిపడలేదు. ఎంతోమంది పరిచయం ఆమె కెరీర్‌కు మరిన్ని బాటలు వేస్తోంది. చాలామంది ఆమె లక్ష్యాలు చేరుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నారు. 'ఇతరులు వారి లక్ష్యాలను చేరుకోవడానికి సాయం చేయడం ద్వారానే నా లక్ష్యాన్ని నేను చేరుకోగలను' అంటూ చెబుతారు. అనితా. అన్నిరకాలగా ఫిట్‌గా ఉండేందుకు నిత్యం యోగా, ధ్యానం చేస్తారు. "నేను కేవలం మంచి విషయాలపైనే దృష్టి పెడతాను. నేను చేసే ప్రతీ పనిలో సంతృప్తి చెందుతాను" అంటూ విజయ రహస్యం గురించి చెబుతారు అనితా. స్ఫూర్తి పొందడమే కాదు... ఎవరికైనా స్ఫూర్తిగా నిలవాలన్నది అనితా సెంథిల్ ఆశయం. అలాంటివాళ్లు వాళ్ల ఊళ్లో చాలా అరుదు, అనుకున్న లక్ష్యాలు సాధించిన మహిళలు ఆ ఊళ్లో తక్కువ మంది ఉన్నారు. అలాంటి వారిని దాటి ముందుకు దూసుకెళ్తోంది అనితా. ఇప్పుడు పలక్కడ్ గ్రామ మహిళలకు ఆదర్శంగా నిలిచారు. అనితా.

"ఒక మహిళగా నేను ఏమీ సాధించలేనని ఎప్పుడూ అనుకోలేదు. కలలు కనండి, వాటిని ప్రేమించండి. వాటికోసం బాగా కష్టపడండి, లక్ష్యం మీ సొంతం అవుతుంది" అని గర్వంగా చెబుతారామె. అబ్దుల్ కలాం రాసిన వింగ్స్ ఆఫ్ ఫైర్ తనకు స్ఫూర్తిగా నిలిచిందంటారు అనితా. అనిత విజయంలో స్నేహితుల ప్రోత్సాహం కూడా ఉంది.

## కాలమ్

### ఒక మంచి కాఫీ లాంటి సందేశం

సోక్రటీసుకు మరణశిక్ష విధించారు. తన ఉపన్యాసాలతో యువకుల్ని నాశనం చేస్తున్నాడని అభియోగం. ఆయన్ని జైల్లో పెట్టారు. ఆ వివేకవంతుడంటే అందరికీ గౌరవం. పేరుకు జైల్లో పెట్టారు కానీ అందరూ వచ్చి ఆయన్ని చూసి వెళుతున్నారు. శిష్య బృందమయితే అక్కడే ఉండి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కానీ ఆ తాత్వికుడు ఇదేమీ పట్టనట్లు నవ్వుతూ అందర్నీ పలకరిస్తూ కబుర్లు చెబుతూ ఉన్నాడు. అందరూ ఆయన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. మరణమంటే లక్ష్యపెట్టని ఆ మహానుభావుణ్ణి చూసి విస్తుపోతున్నారు. మరణ శిక్ష అమలు కావడానికి రెండు గంటల సమయముంది. ఆ శిక్ష విషం తాగి మరణించడం. సమయం సమీపించే కొద్దీ అభిమానుల గుండెలు కొట్టుకుంటున్నాయి. సోక్రటీస్ ఆ సంగతే పట్టనట్లు అది తనకు సంబంధించిన విషయమే కానట్లు ఉన్నాడు. అందరి ముఖాల్లో ఆందోళన దిగులు, ఆయన ముఖంలో ఆనందం వెలుగు. ఆయన కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. బయట ఒక చెట్టు కింద బిచ్చగాడు కూచుని లైర్ వాద్యం వాయిస్తున్నాడు. ఆ తీగల్ని మీటుతూ పాడుతున్న పాట సోక్రటీస్ మనసుని తాకింది. పరవశంగా కళ్ళు మూసుకున్నాడు. చల్లటి గాలి ఆ పాటను మోసుకొచ్చి పరిమళంలా సోక్రటిస్ హృదయాన్ని తాకింది. ఎప్పుడూ ఆనందంగా ఉండే అతను మరింత ఆనందపడ్డాడు.సోక్రటీస్ మెల్లగా కళ్ళు తెరచి జైలర్‌ని పిలిచాడు. జైలర్ ఎంతో గౌరవభావంతో దగ్గరికి వచ్చి ఏమికావాలన్నాడు. సోక్రటీస్ కిటికీలోంచి చూపించి "మీకు అభ్యంతరం లేకుంటే ఆ బిచ్చగాణ్ణి తీసుకొస్తారా?" అని అడిగాడు.

జైలర్ "అయ్యో!దాందేముంది?" అని వెళ్ళి ఆ బిచ్చగాణ్ణి తీసుకొచ్చాడు.

సోక్రటీస్ ఆ బిచ్చగాణ్ణి తనకాపాట నేర్పమన్నాడు. అతని దగ్గర నుంచి లైర్ వాద్యం తీసుకున్నాడు. ఆ బిచ్చగాడు పాటపాడాడు.

సోక్రటీస్ ఆ పాట పాడుతూ లైర్ వాద్యం వాయించాడు. ఇట్లా అరగంట సాధన తరువాత బిచ్చగాడి సాయం లేకుండానే ఆ పాట పాడాడు.

సోక్రటీస్ కృతజ్ఞతలు చెప్పి బిచ్చగాణ్ణి పంపేశాడు. ఆయన శిష్యులు, జైలర్ ఆశ్చర్యపోయారు. మరణశిక్షకు ఇంకా గంట మాత్రమే ఉంది కానీ సోక్రటీస్ ప్రవర్తన వాళ్లకు వింతగా అనిపించింది.

శిష్యులుజి "గురువుగారూ! ఇక గంటలో విషపాత్ర మీ చేతికి వస్తుంది. అది తాగి మీరు ఈ లోకాన్ని వదిలిపెట్టి వెళ్ళబోతున్నారు.

కానీ ఇప్పుడు మీరు లైర్ వాద్యంమీద ప్రాక్టీసు చేసి పాట నేర్చుకున్నారు? ఏమిటిది?" అని కన్నీళ్ళ పర్యంతమయ్యారు. సోక్రటీస్ నవ్వి "జీవితమంటే నేర్చుకోవడం, మరణం గురించి ఆలోచించడం కాదు.

నేను నువ్వు ఇక్కడున్న అందరం ఎప్పుడో ఒకప్పుడు చనిపోతాం. కానీ జీవించినన్నినాళ్ళు ప్రతిక్షణం విలువైందే. ఎప్పటికప్పుడు తెలియంది తెలుసుకోవడంలోనే ఆనందముంది. గంటక్రితం నాకా పాట తెలియాదు. ఇప్పుడు నేర్చుకున్నాను. ఇంకా నాజీవితంలో గంట సమయముంది. అంటే ఇప్పటికీ నేర్చుకోవడానికి నాకు అవకాశముంది" అన్నాడు.శిష్యుల నోట మాట రాలేదు. "జీవితం అంటే యేడుస్తూ కూర్చోడం కాదు., జీవితం అంటే – నాకు ఇంతే రాసి పెట్టి వుంది – అనుకుని – నా ఖర్మ ఇంతే – అంటూ నిందించడం కాదు., జీవితం అంటే – నేర్చుకోవడం." ఇలాంటి కథలో, జీవిత చరిత్రలో,పెద్దల జీవిత విశేషాలో కనీసం మన పిల్లలకైనా చెప్పే ప్రయత్నం చేస్తున్నామా ఇవి చెప్పడానికి మనకు టైం వుండదు కదా! అందుకే పిల్లలు జబర్దస్త్, పటాస్ ఇంకా ఇలాంటి చెత్త కానీ, హారర్ లేదా అసభ్య దృశ్యాలు వున్న సినిమాలు చూస్తూనే వుంటారు కదా!


# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**పి.యల్.సి.బి డెవలపర్స్**
అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలములు కావలసిన వారు సంప్రదించండి
ఫోన్ : 9440662699

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**గమనిక :** క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 9440662699


# విజయవాడ పోలీస్ యూనిట్‌కు అవార్డు




**రాజధాని ప్రతిధిని,విజయవాడ :** నకిలీ మందుల తయారీ మాఫియా ముఠాను చేధించినందుకు గాను విజయవాడ నగర పోలీస్ యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. ఉత్తమ నేషనల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అవార్డు–2018ను ఈనెల 24వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి సురేష్ ప్రభుచేతుల మీదుగా వారు అందుకున్నారు. గత ఏడాది విజయవాడలో జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ పేరుతో నకిలీ మందులు సమస్యల సత్వర పరిష్కారానికి'గ్రామదర్శిని' కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి, కార్పొరేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ ఉదయం 26వ డివిజన్‌లో పర్యటించారు. తొలుత కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా స్థాయి, కార్పొరేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ బస్సులో బయలుదేరి 26వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్‌కు చేరున్నారు. అక్కడ స్థానిక కార్పొరేటర్ జి.హరిబాబుతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ సరఫరా చేస్తున్న తాగునీటిని పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీరించి, పిల్లలకు అసౌకర్యంగా ఉన్నట్లుగా కలెక్టర్ గుర్తించి వెంటనే మరో ప్రదేశానికి కేంద్రాన్ని మార్చాలని ఆదేశించారు. స్థానికులతో కలెక్టర్ మాట్లాడి కార్పొరేషన్ సిబ్బంది రోజూ తాగునీరు సరిపడా సరఫరా చేస్తున్నారా... తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా... సంక్షేమ పథకాల అమలు ఏ విధంగా ఉంది..అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇతర ఉన్నతిధికారులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రోడ్డు భద్రతా వారోత్సవాలు

## కళాశాలల్లో అవగాన కల్పిస్తున్న పోలీసులు



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా గుంటూరు అర్బన్ పోలీసులు ఆధ్వర్యంలో కళాశాలల్లో ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా నల్లపాడు పోలీసుస్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిహెచ్ విజయరావు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడుపుతున్న యువత హెల్మెట్‌లు వాడాలని తెలిపారు. హెల్మెట్ వాడకంపై విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు పుస్తకాలు అందించి వాటితోపాటు స్వీట్లను ఇచ్చివారిని ప్రోత్సహించారు. ట్రాఫిక్ నిబంధనలు, ఆంక్షలు గురించి తెలియపరిచే కరపత్రాలు అందించారు. ఇటీవల కాలంలో విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ వాడకపోవడం వల్ల మరణించిన సమదర్భాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడుపునపుడు తప్పక హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సౌత్ డీఎస్పీ మూర్తి నల్లపాడు సిఐ బాలమురళి కష్ణ,ఎస్ఐలు రాంబబు, బాజీ, సిబ్బంది పాల్గొన్నారు. ఆనంతరం రవాణా ఉపకమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డ్రైవర్లకు, సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు.

# భారత్ మెడికల్ టూరిజంకు ఎదురు దెబ్బ

## తీవ్రమైన ఇన్ఫెక్లన్లే కారణమంటున్న అమెరికా



**న్యూఢిల్లీ :** ఆమెరికా నుండి వైద్య చికిత్స కోసం వచ్చే రోగుల్లో తీవ్రమైన బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకు ఉపయోగించే యాంటీ బయాటిక్ మందు కార్బ పెనెమ్‌ను కూడా ప్రతిఘటించగలిగే ఇన్ఫెక్షన్లు ప్రబలుతున్న కారణంగా భారత్ మెడికల్ టూరిజం మార్కెట్‌కు ఎదురు దెబ్బ తగిలే అవకాశం వుంది. అమెరికా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్‌ఫెక్షస్ డిసీజ్ డైరెక్టర్ ఇందుకు సంబంధించి చేసిన వ్యాఖ్యలు దాదాపు 300 కోట్ల డాలర్ల విలువైన ఈ పరిశ్రమపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయని భావిస్తున్నారు. ఈ పరిస్థితిపై అపోలో హాస్పిటల్స్ క్రిటకల్ కేర్ విభాగ అధిపతి డాక్టర్ జైకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి ఇనెక్షన్లు ఉన్నత పరిశుభ్రతా ప్రమాణాలు పాటించే ఆస్పత్రుల్లో రావని అన్నారు.చ 2020నాటికి ఈ మెడికల్ టూరిజం మార్కెట్ 900కోట్ల డాలర్లకు విస్తరిస్తుందని భావిస్తున్నారు. విదేశాల నుండి వచ్చే రోగులు ముందుగా ఇక్కడ తక్కువ ఖర్చు అయ్యే ఆస్పత్రులను ఎంచుకుని అక్కడకు వెళతారని, అక్కడ ఏమైనా సమస్యలు ఎదురైతే అప్పుడు ఉన్నత ప్రమాణాలు కలిగిన ఆస్పత్రులవైపు చూస్తారని అదే పెద్ద సమస్యగా మారిందని అన్నారు రోగి ఒక ఆస్పత్రి నుండి మరో ఆస్పత్రికి వస్తున్నాడంటేనే తనతో కూడా ఇన్ఫెక్షన్లను తీసుకువస్తాడని చెప్పారు. విదేశాల నుండి వచ్చే రోగులకు చికిత్స అందించడానికి కొన్ని ఆస్పత్రులను గుర్తించాలని, ఆ మేరకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయాలని తాము సూచిస్తున్నామని కిమ్స్ ఆస్పత్రి ఎండి భాస్కర రావు చెప్పారు.

# ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ షెడ్యూల్ విడుదల

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఆశావాహులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం ప్రకటన చేశారు. మే 4న టెట్, జులై 6న డీఎస్సీ నోటిఫికేషన్లను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహిస్తుందని చెప్పారు.ఆరు కేటగిరీల్లో(ఎస్‌జీటీ, ఎస్ఏ, పీఈటీ, ఎల్‌పీ, మ్యూజిక్) మొత్తం 10,351 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. టెట్, డీఎస్సీల సిలబస్‌ను వారంలోగా వెల్లడిస్తామని చెప్పారు. వచ్చే విద్యా సంత్సరానికి ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా జూన్ 12 కల్లా భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

**డీఎస్సీ నోటిఫికేషన్ వివరాలు**

నోటిఫికేషన్ : 6-7-2018
దరఖాస్తు గడువు : 7-7-2018 నుంచి 9-8-2018 వరకూ
హాల్ టికెట్స్ : 15-08-2018
పరీక్షలు : 23-08-2018 నుంచి 30-08-2018 ( రెండు సెషన్లలో 9.30 నుంచి 12, 2.30 నుంచి 5 గంటల వరకూ పరీక్షలు)
ప్రాథమిక కీ : 31-08-2018
అభ్యంతరాల గడువు : 31-08-2018 నుంచి 07-09-2018 వరకూ
ఫైనల్ కీ :10-09-2018
తుది ఫలితాలు : 15-09-2018

# ధనిక-పేద తారతమ్యం కమ్యూనిజంతోనే అంతం




కమ్యూనిజం అనే పదం కమ్యూనిస్ అనే లాటిన్ పదం నుండి వచ్చింది. ఉమ్మడి ఆస్తి అని అర్థం. ఇది ఒక సామాజిక జీవన విధానం. కమ్యూనిజం ముఖ్య ఆశయం వర్గ, ఆర్థిక సామాజిక తారతమ్యాలు లేని ఒక నూతన సమాజ స్థాపన. ఉత్పత్తికేంద్రాలు, వనరులపై ఉమ్మడి యాజమాన్యం. ఈ ప్రతిపాదన 19వ శతాబ్దంలో చేయబడినా, ఆచరణలోకి 20వ శతాబ్దపు మొదటి రోజులలో వచ్చింది.

**కమ్యూనిజం**

మానవుడు సంఘ జీవిగా పరిణామం చెందడానికి మూల కారణం శ్రమ విభజన. అసమానతలను పోగొట్టే అవకాశాలను పొందుపరిచి తద్వారా మానవుడి సంఘ జీవన విధానాన్ని సంస్కరించే ప్రయత్నమే కమ్యూనిజం. కమ్యూనిజం సామాజిక, ఆర్థిక అసమానతలను పోగొట్టటానికి మార్గాలను సూచించిన ఒక సిద్ధాంతం.

క్రీ.పూ. 300లో గ్రీకు తత్వవేత్త అయిన ప్లేటో తన 'ద రిపబ్లిక్' గ్రంథంలో ఈ విధమైన భావన గురించి చర్చించాడు. శతాబ్దాల నుండి అనేక మంది తత్వవేత్తలు, సంస్కర్తలు ఉమ్మడి యాజమాన్యం, శ్రమకు తగ్గ ప్రతిఫలం లాంటి సామ్యవాద ఆదర్శాల గురించి విస్తృతంగా చర్చించారు. ఈ భావాలన్నింటినీ జర్మనీకి చెందిన కార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిక్ ఏంజిల్స్ 1848లో రచించిన కమ్యూనిస్టు ప్రణాళికలో మొట్టమొదటిసారి వెల్లడించారు.

అమెరికా ఖండములో కమ్యూనిస్టులు సాధించిన ఒకే ఒక్క విజయం క్యూబా లోనే సంభవించింది. 1959లో ఫీడెల్ కాస్ట్రో క్యూబాకు అధికారం చేపట్టాడు. రెండు సంవత్సరముల తరువాత తన ప్రభుత్వాన్ని సామ్యవాద ప్రభుత్వంగా కాస్ట్రో ప్రకటించాడు.

**మిగతా ప్రాంతాలలో సామ్యవాద ప్రభుత్వాలు**

ఆఫ్రికా దేశాలైన అంగోలా, మొజాంబిక్ లలో 1975లో వామపక్ష గెరిల్లా దళాలు సామ్యవాద ప్రభుత్వాలను ఏర్పరచాయి. ఇవి 1990 వరకు అధికారంలో ఉన్నాయి. మిగతా కొన్ని ఆఫ్రికా దేశాలలో కూడా 1970 మరియు 80వ దశకాలలో కొద్దికాలం మనగలిగిన సామ్యవాద ప్రభుత్వాలు ఏర్పరచబడ్డాయి. మధ్య అమెరికా ఖండపు దేశమైన నికరాగువాలో 1979లో సామ్యవాద ప్రభుత్వం ఏర్పడి 1990 వరకూ కొనసాగింది.

**ఆచరణలో కమ్యూనిజం**

ఆర్థిక కార్య కలాపాలన్నింటినీ ప్రభుత్వం నియంత్రించే కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంటాయి. కమ్యూనిస్టు దేశాలు వ్యక్తిగత స్వేచ్ఛకన్నా సామూహిక ప్రయోజనానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి.

**రష్యాలో కమ్యూనిజం..**

పరిశ్రమలు పెరిగే కొలదీ నగరాలలో విస్తరిస్తున్న మధ్యతరగతి వర్గం, శ్రామిక వర్గంలో అసంతృప్తి పెరిగింది. దీనికి తోడు 1890వ దశకంలో రష్యాలో సరిగా పంటలు పండక పోవటంతో రైతులు తిండిలేక అల్లాడిపోయారు. విప్లవ కార్యకలాపాలు పెరిగి మార్క్సిజం లాంటి సామ్యవాద భావాలు ప్రజలలో వ్యాప్తి చెందాయి. మార్క్స్ తన సిద్ధాంతాలు జర్మనీలోనో, ఇంగ్లాండ్ లోనో లేక మరేదయినా పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశంలోనో ఆచరింపబడతాయని భావించాడు. కానీ ప్రధానంగా వ్యవసాయిక దేశమైన రష్యాలో కమ్యూనిస్టులు మొట్టమొదటి సామ్యవాద ప్రభుత్వాన్ని ఏర్పరచటంలో సఫలీకృతులయ్యారు. 1917లో రష్యా ప్రజలు చక్రవర్తి జార్‌ను పదవీచ్యుతుణ్ణి చేశారు. ఒక తాత్కాలిక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుచేయబడింది. 1917 వసంతకాలంలో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కులు అధికారాన్ని చేజిక్కించుకుని కమ్యూనిష్టు ప్రభుత్వాన్ని స్థాపించారు.

**లెనిన్ కాలం**

1917 నుండి 1924లో మరణించేవరకూ రష్యాకు లెనిన్ నాయకత్వం వహించాడు. రష్యాలోని పరిశ్రమలన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఒక కేంద్ర నిర్వాహక సంస్థను వాటిని నడపటానికి నియోగించింది. మొదటి ప్రపంచ యుద్ధం(1914-1918), విప్లవం, అంతర్యుద్ధం ఇవన్నీ కలసి రష్యాను ప్రధానమైన ఉత్పత్తి వనరులన్నీ వ్యక్తిగత ఆస్తి రూపంలో ఉండే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను నిర్మూలించాలని మార్క్స్ పిలుపునిచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో యాజమాన్యాలు లాభాలు స్వీకరిస్తాయి కనుక పనివారికి వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద కొద్దిమంది చేతిలో పోగుపడి మధ్యతరగతికి చెందిన అనేకమంది శ్రామిక వర్గంలోకి నెట్టివేయబడతారు.

**కమ్యూనిజంలో రకాలు**

కమ్యూనిజంలో తిరిగి అనేక వర్గాలు ఉన్నాయి. వీటిలో మార్క్సిజం, లెనినిజం ముఖ్యమైనవి. మార్క్సిజం జర్మనీకి చెందిన కార్ల్ మార్క్స్ ఆలోచనల నుండి పుట్టినది కాగా లెనినిజం రష్యాకు చెందిన వ్లాడిమీర్ లెనిన్ భావనలకనుగుణంగా ఏర్పాటైన సిద్ధాంతము.

**సామ్రాజ్య వాదం**

అంటే ఒక దేశం ఇతర దేశాల మీద పెత్తనం చేయటం. యూరోపియన్ సామ్రాజ్య వాద దేశాలలోని పెట్టుబడిదారులు ఆసియా, ఆఫ్రికా దేశాల మీద పెత్తనం చేస్తూ అక్కడినుండి తీసుకు వచ్చిన తక్కువ వేతనాలకు పనిచేసే శ్రామికుల ద్వారా పనిచేయించుకున్నారు. దీనివలన పెట్టుబడిదారులు చవకగా వస్తూత్పత్తి చేయగలిగారు.

**కమ్యూనిజం-సోషలిజం**

కమ్యూనిజం, సోషలిజం అనే పదాలు సమానార్థకాలు కావు. కమ్యూనిష్టులు తమను తాము సోషలిష్టులుగా భావిస్తారు. కానీ సోషలిష్టులు తాము కమ్యూనిష్టులుగా భావించరు. సోషలిష్టులూ, కమ్యూనిష్టులూ ఇరువురూ కూడా ఉత్పత్తి వనరుల ఉమ్మడి యాజమాన్యాన్నే కోరుకుంటారు. సోషలిష్టులు శాంతియుత, చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా ఈ పరిణామం జరగాలని కోరుకుంటే, కమ్యూనిస్టులు బలవంతంగా విప్లవంద్వారా జరగాలని కోరుకుంటారు..

**ఐరోపా ఖండములో**

రెండవ ప్రపంచ యుద్ధం వలన సంభవించిన అంతర్జాతీయ అస్థిరత్వం కమ్యూనిజం యొక్క వ్యాప్తికి దోహద పడింది. జర్మనీ దేశ మొట్టమొదటి కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడిన రష్యాదేశాలు మొదట సంధి చేసుకున్నా, రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రత్యర్థులుగా నిలిచాయి. రష్యా పై దాడి జర్మనీ ఓటమికి ముఖ్య కారణంగా చెప్తారు.

**ఆసియా ఖండములో**

చైనా కమ్యూనిష్టులు, దేశాన్ని పాలిస్తున్న జాతీయ ప్రభుత్వం రెండూ 1930వ దశకంలో దేశం మీదికి దండెత్తి వచ్చిన జపాన్ మీద పోరాడాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం కమ్యూనిష్టులకు, జాతీయ ప్రభుత్వానికి మధ్య అంతర్యుద్ధం తలయెత్తినది. మావో జెడాంగ్ నాయకత్వంలో 1949లో చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్యుద్ధంలో గెలిచి ఆ దేశంలో అధికారంలోకి వచ్చింది.

ఆఫ్ఘనిస్థాన్లో 1978లో కమ్యూనిష్టులు అధికారంలోకి వచ్చారు. ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేకమంది ఆఫ్ఘన్‌లు తిరుగుబాటు చేసారు. 1979లో సోవియట్ యూనియన్ సామ్యవాద ప్రభుత్వానికి మద్దతుగా ఆఫ్ఘనిస్థాన్ కు సైన్యాన్ని పంపింది. ఈ సైన్యానికి ఆఫ్ఘన్ తిరుగుబాటు దారులకు మధ్య సుదీర్ఘ కాలం పోరాటం జరిగింది. 1989లో సోవియట్ తన సైన్యాన్ని ఉపసంహరించుకున్నది. 1992లో తిరుగుబాటు దారులు సామ్యవాద ప్రభుత్వాన్ని కూలదోసారు. ఈ విధంగా రష్యా లేదా చైనాల సహకారంతో కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు ఏర్పడి తద్వారా అయా దేశాలలో కమ్యూనిజం వ్యాపించిందని చెప్పవచ్చు.

సాంస్కృతిక విప్లవాన్ని కూడా తీసుకుని వచ్చి సంగీత సాహిత్య రంగాలలో కూడా కమూనిజాన్ని జొప్పించాడు. వ్యావసాయిక రంగంలో చాలావరకు అభివృద్ధి జరిగింది.

1976 నాటికి చైనాలో మావో మరణించే సమయానికి చైనా ఆర్థిక వ్యవస్థ అత్యంత బలహీనమైనది. మావో మరణం తరువాత డెంగ్ జియావో పింగ్ నాయకత్వంలోని ఆర్థిక సంస్కరణాభిలాషుల బృందం చైనా కమ్యూనిష్టు పార్టీ మీద నియంత్రణ సాధించింది. ఈ కొత్త నాయకత్వం ప్రైవేటు రంగంలో వ్యవసాయాన్ని, చిన్న చిన్న వ్యాపారాలను అనుమతించింది. అప్పటి వరకు తిరస్కరించిన విదేశీ పెట్టుబడులను అనుమతించింది. విదేశీ పెట్టుబడిదారులు పరిశ్రమలు స్థాపించి వస్తూత్పత్తి , ఎగుమతులు చేయుటకు సముద్రతీర ప్రాంతాలలో అనేక ప్రత్యేక ఆర్థిక మండళ్ళను నెలకొల్పినది. ఈ సంస్కరణలన్నీ చైనా ఆర్థిక వ్యవస్థ క్రమేణా అభివృద్ధి చెందటానికి , ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడటానికి దోహదంచేశాయి. కాని ఇన్ని సంస్కరణలు జరిగినా రష్యాలోలా కాక చైనాలో డెంగ్ నాయకత్వంలోని కమ్యూనిష్టు పార్టీ రాజకీయంగా తన పట్టును నిలుపుకోగలిగింది. ప్రపంచీకరణను అందిపుచ్చుకొని ప్రభుత్వ రంగంలోని ప్రాధాన్యతా రంగాలను తమ వద్దే ఉంచుకొని దేశాన్ని అభివృద్ధి పాట పట్టించడం గమనార్హం . అదే సమయంలో భారత్‌లోని పాలక వర్గాలు రక్షణరంగం, పౌరవిమానయానం వంటి ప్రముఖ సంస్థలను కూడా ప్రైవేటీకరణ చేసి ప్రజలను మభ్యపెడుతున్నారు.


ప్రస్తుతానికి చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా దేశాలలో కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు ఉన్నాయి.

**దేశంలో దీనావస్థలో కమ్యూనిజం**

దేశంలోని అధికార బీజేపీ, కాంగ్రెస్‌లు మతోన్మాదం, అవినీతి, పక్షపాతం, స్కాములతో మునిగిపోయిన సమయంలో ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీల కోసం ఎదురు చూస్తుండంగా కమ్యూనిస్టులు తమ సత్తా చూపలేక చతికిల పడటం దేశ ప్రజలను నివ్వెర పరుస్తోంది. సిద్ధాంతాల పేరుతో వెనకబడిపోవడం, ఈ రెండు పార్టీలను సమైక్యంగా సమర్థవంతంగా ఎదుర్కొనలేకపోతున్నాయి. సీపీఎంలో ఒక వర్గం, కాంగ్రెస్‌తో ముందుకు వెళదాం అని మరొక వర్గం వారితో వద్దని జరిగిన గజిబిజిలో కాంగ్రెస్ కలసి నడిచే వర్గానికే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

రాష్ట్రంలో వామపక్ష పార్టీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కాలానుగుణంగా సిద్ధాంతాలకు పదును చేర్చి ప్రజాబాహుళ్యాన్ని వెంట తిప్పుకొని అవినీతి ప్రభుత్వానికి చుక్కలు చూపాల్సి ఉండగా, ఇక్కడి వామపక్షాలు ఎక్కడో దూరంగా ఉండిపోయాయి. చివరి బడ్జెట్ సమయంలో రాష్ట్రానికి పైసా విదిలించకపోవడం వామపక్షాల ఇచ్చిన బంద్ సక్సెస్ అయినా కూడా పవన్ వెంట తిరగడమే తప్ప స్వతంత్రంగా, గళాన్ని సవరించి వారి మద్దతు సంపాదించడంలో ఘోరంగా ఫెయిలయ్యాయి. వీటికంటే వెనుక వచ్చిన పార్టీలు ఆప్, తృణమూల్ కాంగ్రెస్ లాంటి చిన్న చిన్న పార్టీలు ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నా.. వీటి స్థానం మాత్రం ఏమాత్రం మెరుగవడం లేదు.

నిజం చెప్పాలంటే వెనుకటి తరం నిజాయితీ, నిబద్ధత ప్రస్తుత తరంలో లోపించాయి. అమెరికా పెత్తందారీ వ్యవస్థను అడ్డుకుంటామని చెబుతూనే వారి పిల్లలను మాత్రం అమెరికాలో చదివించడం, అమెరికా నేతలు వస్తే వారికెదురుగా నల్లజెండాలతో ఊరేగడం తప్ప వీరు చేస్తోంది ఏమీ ఉండటం లేదు. తమ పిల్లలకు వారసత్వంగా కమ్యూనిజాన్ని అందించడం లేదు. కొత్త క్యేడర్ లేకపోవడం కొనసాగితే భవిష్యత్‌లో కామ్రేడ్‌లు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. ఆర్థిక , రాజకీయ, సాంఘికంగా అన్ని అవకాశాలు అందరికీ ఉండాలని చెప్పే కామ్రేడ్లలో కూడా కులతత్వం ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీల్లోని ఏ ఒక్కరికి పార్టీ పదవులు కట్టబెట్టిన పాపాన పోవడం లేదు. ఏది ఏమైనా కమ్యూనిస్టులంలా ఏకమై కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కోవాలని దేశవ్యాప్తంగా ప్రజలు ముక్తగంటంతో కోరుతున్నారు.





**'ఎ కమ్యూనిస్టు సక్సెస్' పేరుతో వాషింగ్టన్ పోస్టు కేరళ ప్రభుత్వ విజయాలపై రాసింది. ఇచ్చిన వాగ్దానాలను ఎన్ని కష్టాలు ఎదురైనా నెరవేర్చే అవినీతి రహిత ప్రభుత్వంగా, సంపూర్ణ అక్షరాస్యత, రైతులకు లాభసాటిగా ఉండి దేశంలో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా ఉంది. అక్కడ పండిన పంటను ముందు రైతులు తమ కుటుంబ అవసరాలకు దాచుకున్న తర్వాతే మిగతా వాటిని ప్రభుత్వమే కొంటుంది. మాణిక్ సర్కార్ ఆధ్వర్యంలో నిన్నమొన్నటి వరకు ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో కూడా ఎటువంటి ఉద్రిక్తతలు, అవినీతి అక్రమాలు, సంపూర్ణ విద్య, మతకల్లోలు లేని రాష్ట్రంగా పేరుగాంచింది.**




## పరిశోధనలకు పెద్దపీట : ఎస్ ఆర్ ఎం

**ఎస్ఆర్ఎంలో డిజైన్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, అమరావతిలోని ఎస్ఆర్ఎం, అమెరికా పర్డ్యూ విశ్వవిద్యాలయం నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ ఏర్పాటు చేయనున్నాయి. అమెరికాలోని పర్డ్యూ విశ్వవిద్యాలయానికి చెందిన డైరెక్టర్ ప్రొఫెసర్ విలియం ఓక్స్, ఆదేశానికే చెందిన అబెట్ సంస్థ అడ్జంక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. కాంతా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ టి.లక్ష్మి విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ ఏర్పాటుపై చర్చించినట్లు ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం ప్రొ. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయోషన్ స్థాయిలో కోర్సులను నిర్వహించడంతోపాటు ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల్లో పరిశోధన చేపట్టటడం నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యమని ఆయన వెల్లడించారు.

## పసివారి రక్షణకు టూల్


**వీఐటీ ఆధ్వర్యంలో కొత్త ఆవిష్కరణలు**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** పిల్లలపై లైంగిక దాడులు చేసే వారి మనస్థత్వాలు పసిగట్టేందుకు పర్డ్యూ వర్సిటీ పరికరం తయారు చేసినట్లు ప్రకటించింది. ఐవోటి ,డేటా అనాలటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లదే భవిష్యత్తని ఆ సంస్థ ప్రకటించింది. టెక్నాలజీ పరిశోధన కోసం కలిసి పనిచేయనున్న వీఐటీ-ఏపీ ,పర్డ్యూ యూనివర్సిటీలు సంయుక్తంగా ముందుకెళతాయని డైరక్టర్ డాక్టర్ విలియం ఓక్స్ అన్నారు. టెక్నాలజీలో రోజు రోజుకి మార్పులు జరుగుతున్నాయని నిరంతరం అప్ డేట్ గా ఉంటేనే సంస్థల అవసరాలకు అనుగుణంగా రాణించగలుగుతామని ఆయన వెల్లడించారు. విలియం ఓక్స్ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ ప్రతినిధులతో కలిసి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు, ప్రస్తుతం పర్డ్యూ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ చిన్న పిల్లల పై లైంగిక దాడులు జరిపే వారి మనస్థత్వం అర్థం అయ్యేలా ఒక టూల్ తయారు చేస్తోందని, దీంతో లైంగిక దాడులకు పాల్పడే లక్షణాలను పసిగడుతుందని డాక్టర్ ఓక్స్ చెప్పారు. అమరావతి నుంచి కూడా కొత్త కొత్త ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని దీని కోసం తాము వీఐటీ -ఏపీతో కలిసి పని చేస్తామన్నారు. దీనికోసం మరో రెండు నెలల్లో కార్యాచరణ ప్రారంభిస్తామని డాక్టర్ విలియం ఓక్స్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో వీఐటీ-ఏపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ ,వీఐటీ ఏపీ వైస్ చాన్సలర్ డాక్టర్ శుభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ శివకుమార్ ,ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మే 5 వరకు షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఎంట్రీలు

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) రెండో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహంస్తున్న షార్ట్ ఫిలిమ్ పోటీల ఎంట్రీలకు గడువును ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 5 తేదీ వరకు పొడిగించినట్లు తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు బీకేఎన్ఎస్. ప్రసాద్ తెలిపారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ షార్ట్ ఫిలిమ్ మేకర్స్ విజ్ఞప్తితో ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. షార్ట్ ఫిలిమ్ పోటీల్లో మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలతోపాటు నటుడు, దర్శకులు, కెమెరామెన్, ఎడిటర్లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. ఎస్ఎంఎస్ నిర్వాహకులు దారపు సురేంద్ర రెడ్డి, రెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, తెలుగు షాష్ట్ ఫిలిం అసోసియేషన్ కార్యదర్శ కవి పీఎన్ఎం ప్రేమ్ పాల్గొన్నారు.




# ఉద్యోగుల సమస్యలపై సత్వర కార్యాచరణ

**మహిళా, శిశుసంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం**




**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. సంఘం పనితీరు, సభ్యుల విధుల, బాధ్యతలు తదితర అంశాలకు సంబంధించిన అంశాలపై సభ్యులతో సీనియర్ నాయకులు ప్రమాణం చేయించారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో అద్దాల సుబ్బరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జంపాని సత్యన్నారాయణ, ఉపాధ్యక్షులు బి. ఆంధ్రజ్యోతి ఎజెఎం రాధాకృష్ణ, కె మంజులవాణి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్. విద్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వి. చంద్రారెడ్డి జాయింట్ సెక్రెటరీగా డి.బాబా నూరుద్దీన్ పిఆర్ ఎవంజిలిన్, ఎ.శేషాచార్యులు, కోశాధికారిగా సిహెచ్ శ్రీరామ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ తమ ప్యానల్‌పై నమ్మకం ఉంచిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఉద్యోగులందరి సమస్యల పరిష్కారానికి తక్షణమే కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతుమన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుకుమార్, ఎంఎన్ మూర్తి తదితరులు ప్రసంగించారు.

Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com